నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, ఆదివారం 23 జూన్ 2024 | KAMAREDDY

- కేసీఆర్ ఉన్నన్ని రోజులు కరెంటు బాధ తెల్వలేదు
- మళ్లా పాత రోజులు వచ్చేటట్లు కనవడ్తుంది
- నిరంతర కరెంటు సరఫరాపై రైతులు, చిరుపరిశ్రమల యజమానుల మనోగతం



సారు పాలనలో.. సక్కంగ కరెంటు

'ఉమ్మడి రాష్ట్రంలో అరకొర కరెంటు సరఫరాతో అష్టకష్టాలు పడ్డం. రైతులందరం రాత్రిపూట బావుల కాడ...చిన్న మిషిన్లు నడుపుకొనేటోళ్లం దుకాణాల్ల పండుకొని కరెంటు కోసం కండ్లల్ల వొత్తులే సుకొని జూసేటోళ్లం.. మన రాష్ట్రం మనకు వచ్చిన తర్వాత కేసీఆర్ సారు కరెంటు విషయంల మస్తు సొలత్ చేసిండు. రాత్రింబవళ్లు కరెంటు పోకుండా మంచిగ జేసిండు. ఆయన ఉన్నన్ని రోజులు కరెంటు బాధలు తెల్వకుండ ఉన్నం. గిప్పుడు మొన్నొచ్చినోళ్లు మళ్లా పాత రోజులను గుర్తుకు తెస్తుండ్రు. ఎక్కడ జూసినా కరెంటు పోవుడు.. వచ్చుడు..ఇదే ముచ్చట వినిపిస్తున్నది. చిన్న వాన పడ్డా కరెంటు పోతున్నది. గా కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఎట్ల జేసిండో.. కరెంటు సక్కగ ఇచ్చిండు..ఆ సారును మొక్కాలె.' అంటూ రైతులు, చిరుపరిశ్రమల యజమానులు అభిప్రాయపడుతున్నారు.

మొన్నటిదాకా కరెంటు బాధలు లేకుండె..

శక్కర్‌నగర్, జూన్ 22: కేసీఆర్ హయాంలో మొన్నటి వరకు కరెంటు బాధలు అనేవి లేకుండె. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలన నుంచి నేను కుట్టుమిషన్ కుడుతున్న. పాత కుట్టుమిషన్‌తో ఎక్కువ బట్టలు కుట్టేందుకు వీలయ్యేది కాక పోతుండె. పొద్దాంత కుట్టినా కుటుంబపోషణకు సరిపోయేది కాదు. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ సారు పుల్లుగా కరెంటు ఇచ్చుడు షురూ జేసిండు. ఇగ అప్పుడే కరెంటుతో నడిచే మిషన్లను కొన్న. తక్కువ టైంల ఎక్కువ బట్టలు కుట్టుడు అయితుండె. బట్టలు కుట్టే టైంల కరెంటు పోవుడు ముచ్చటనే లేకుండె. మాలాంటి చిన్నచిన్న దుకాణాల నుంచి పెద్దపెద్ద ఫ్యాక్టరీల వరకు అందరికీ కరెంటు మంచిగ ఇచ్చిండు. తెలంగాణ డవలప్ అయ్యిందంటే కేసీఆర్ సారు ఇచ్చిన కరెంటుతోనే. అసొంటి సారును కొత్తగా వచ్చిన సర్కారోళ్లు ఇబ్బంది పెట్టుడు కరెక్టు కాదు. ముందు కరెంటు మంచిగ ఇచ్చి చూపెట్టుండ్రి.

- అబ్దుల్ సమద్, టైలర్, ఎడపల్లి

ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేవికాదు..

రుద్రూర్, జూన్ 22: కేసీఆర్ ఉన్నప్పుడు 24గంటలు కరెంటు ఉంటుండే. రైతుల ఎప్పుడంటే అప్పుడే తమకు వీలైన సమయంలో పొలం పారబెట్టుకొని వెళ్తుండే. కేసీఆర్ హయాంలో రైతులకు ఎలాంటి లోటు కూడా రాలేదు. 24గంటలకు కరెంటు ఇస్తుండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడాలు కూడా తక్కువుండే. ఇప్పుడు ప్రభుత్వం మారింది. రోజు ఏదో ఒక టైములో కరెంటు పోతున్నది. మళ్లీ కరెంట్ కష్టాలు వస్తాయేమోనని భయంగా ఉంది.

-బొట్టె ప్రభాకర్ యాదవ్,కౌలు రైతు

నారు ఎండిపోతున్నది..

నవీపేట, జూన్ 22: ఇప్పుడు వాన కాలం పంట పనులు మొదలైనయి. నారు పోసినం. నారుకు నీరు పెట్టేందుకు కరెంట్ పోయినప్పుడల్లా చాలా ఇబ్బందులుపడుతున్నం.పోసిన నారుకు నీరు అందక నీరు ఎండి పోతుంది. 24 గంటల తీఫేస్ కరెంట్ సరిగ్గా ఉంట లేదు. నాకు ఐదెకరాల్లో పంట వేసినం. కరెంట్ సరిగ్గా ఇవ్వక పోగా ఇటు వర్షాలు కూడా కురువడంలేదు. ఎండలకు నారు ఎండి పోతుంది.

-బైండ్ల చిన్న సాయిలు రైతు రాంపూర్ నవీపేట మండలం..

చెట్ల కింద చదువులు

- అమలుకు నోచుకోని అమ్మ ఆదర్శ పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఒకే గదిలో 75 మంది విద్యార్థులకు బోధన

ఆహ్లాదకర వాతావరణంలో చదవాల్సిన విద్యార్థులు అవస్థల మధ్య పాఠాలు నేర్చుకుంటున్నారు. శిథిలావస్థకు చేరిన తరగతి గదులు... ఎప్పుడు మీద కూలుతాయో తెలియని పైకప్పులు ఉండడంతో చెట్ల కింద చదువులు సాగిస్తున్నారు డోంగ్లీ మండలం మారేపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు.
-డోంగ్లీ, జూన్ 22

చెట్టు కింద పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు దాగి ఉంటుంది. ఉత్తమ పౌరులు తయారయ్యేది తరగతి గది నుంచే.. అలాంటి తరగతి గదులతోపాటు విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం మారేపల్లి పాఠశాలలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా.. మారుమూల గ్రామాల్లోని పాఠశాలలను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శిథిలావస్థలో ఉన్న తరగతి గదులు

75మందికి ఒకే గది..

మారేపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మొత్తం 75మంది విద్యార్థులు ఉన్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన భవనాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఒకే ఒక్క గది(ఆఫీస్‌రూం) బాగున్నది. మిగిలిన గదులన్నీ పెచ్చులూడిన స్లాబ్, గోడలతో దర్శనమిస్తున్నాయి. అందులో తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. దీంతో విద్యార్థులను ఆరుబయట చెట్ల కింద కూర్చొబెట్టి ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. పాఠశాల పక్కనే రోడ్డు ఉండడంతో ఆరుబయట చదివే విద్యార్థులకు వాహనాల శబ్దాలు ఇబ్బందికరంగా మారాయి. ఒకవేళ వర్షం కురిస్తే ఉన్న ఒకే గదిలో అందరినీ కూర్చోబెడుతున్నారు.

అమలుకు నోచుకోని అమ్మ ఆదర్శ పనులు..

పాఠశాలల పునఃప్రారంభానికి ముందే అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులు పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్దేశించినా అమలుకు నోచుకోలేదు. మరుగుదొడ్ల రిపేర్లు, నీటి పైప్‌లైన్ తదితర మరమ్మతు పనులు చేసిమమ అనిపించారు. ప్రధాన సమస్య అయిన తరగతి గదుల నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే లేడు. శిథిల దశలో ఉన్న భవనాల కిటికీల బిగింపు, ఫ్లోర్ మరమ్మతులు చేపట్టడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తరగతి గదులు సరిగా లేకపోవడంతో ఈ పాఠశాలకు వచ్చేందుకు విద్యార్థులు జంకుతున్నారని, దీంతో పేద పిల్లలు చదువుకు దూరమయ్యే అవకాశం ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పాఠశాలకు తరగతి గదులు నిర్మించాలని కోరుతున్నారు.

పాఠశాల ఆఫీసు రూం, తరగతి గది ఇదే..

సమాజసేవ చేయడం అభినందనీయం

జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, జూన్ 22 : సమాజసేవలో భాగస్వాములు కావడం, ఎదుటి వారి అవసరాలను గుర్తించి వారికి సహాయ సహకారం అందించడం అభినందనీయమని నిజామాబాద్ జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. జిల్లా కోర్టులో న్యాయ సేవాధికార సంస్థ, స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై సెక్స్‌వర్కర్లు, ట్రాన్స్‌జెండర్లకు నాలుగు నెలలకు సరిపడా బియ్యాన్ని అందజేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, డీఎల్ఎస్ఏ సూపరింటెండెంట్ పురుషోత్తం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఎంపీ అర్వింద్ ఇల్లు ముట్టడి

వినాయక్‌నగర్, జూన్ 22: నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ అర్వింద్ ఇంటిని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం ముట్టడించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నాయకులు నినాదాలు చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చెలగాటమాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఫలితాలు అస్తవ్యస్తంగా వచ్చాయని ఆరోపించారు. ఎంపీ ఇంట్లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి గౌతం, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు స్వామి, జిల్లా అధ్యక్షుడు వేణురాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి విఘ్నేశ్ పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ ఇంటిని ముట్టడిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

జిల్లా పోలీసులకు సేవా పతకాలు

వినాయక్‌నగర్, జూన్ 22:విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా పోలీసులకు ప్రభుత్వం వివిధ సేవా పతకాలను ప్రకటించింది. ఈ మేరకు జిల్లా పోలీసు శాఖలో పని చేస్తున్న 41మందిని వివిధ పతకాలకు ఎంపిక చేసింది. ఈ మేరకు డీజీపీ కార్యాలయం శనివారం జాబితాను విడుదల చేసింది. నిజామాబాద్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏఆర్ఎస్ఐగా పని చేస్తున్న పి.కోటేశ్వరరావుకు మహోన్నత సేవా పురస్కారం లభించింది. వివిధ విభాగాల్లో పని చేస్తున్న వారికి సేవా పతకాలను ప్రకటించింది. ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, ఆర్ఎస్సైలు అస్కా సోలోమన్, సాయన్న, ఎస్సై మహమ్మద్ నజీబ్, అంజమ్మ, దేవళ్ల పద్మ, ఏఎస్సైలు కే.రాఘవేందర్‌రావు, మహమ్మద్ అబ్దుల్ కరీం, కే.గంగాధర్, సుంకరి రాజు, సయ్యద్ మహమ్మద్ హబీబ్, ఎం.చిరంజీవులు, కే.రాజేంద్రప్రసాద్, ఏ.లక్ష్మీనారాయణ, ఎం.వెంకట్‌కుమార్, పి.శంకర్, కే.రమేశ్, జి.చిన్నయ్య, టి.దుర్గాప్రసాద్‌రావు, జి.రేణుకాదేవి. తజుమల్ అహ్మద్, సీహెచ్ కోటయ్య, అబ్దుల్ హకీం, పి.పోశెట్టి, సీహెచ్ ముత్తయ్య, పి.వసంతరావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఎస్.రామస్వామి, హెడ్‌కానిస్టేబుళ్లు జే.మైఖేల్, కైలాసపతి, శెట్టయ్య, శేఖర్, హన్మాండ్లు, యాకుబ్‌రెడ్డి, మోతిరాం, జి.కిషన్, నరేందర్, అబ్దుల్ నయీం, బి.గోపాల్, గాండ్ల సాయన్న, అబ్దుల్ సమద్, జీవన్, కానిస్టేబుళ్లు అబ్దుల్ సమీర్, దేవాగౌడ్ గోపాల్, వెంకటరమణ, సుబ్బారావు, కైసర్ ఘోరీలను సేవా పతకాలు వరించాయి. ఏడో బెటాలియన్‌కు చెందిన ఆర్ఐ సురేశ్, ఆర్ఎస్సై నాగరాజు కూడా సేవా పతకాలు దక్కించుకున్న వారిలో ఉన్నారు. ఇక, కామారెడ్డి జిల్లా నుంచి అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఇన్‌స్పెక్టర్ మదన్ జార్జ్, ఎస్సైలు కొండారెడ్డి, ఎండీ తాజుద్దీన్, ఏఎస్సై నర్సయ్య, హెడ్‌కానిస్టేబుళ్లు షేక్ అహ్మద్, నర్సింహులు, హన్మాండ్లు, సాయిరెడ్డికి సేవా పతకాలు లభించాయి.

నేడు నిజాంసాగర్ నీటి విడుదల

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

బాన్సువాడ, జూన్ 22: 'కష్టాల సాగు..' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. నిజాంసాగర్ నీటి విడుదల కోసం రైతులు ఎదురు చూస్తున్నారంటూ సమగ్ర వార్తను ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం వానకాలం పంటల సాగు కు నిజాంసాగర్‌ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదలకు ముహూర్తం పెట్టారు. ఆదివారం ఉదయం 9గంటలకు నిజాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సీఐల బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన ఐజీ

వినాయక్‌నగర్, జూన్ 22: మల్టీ జోన్-1 పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు స్థానం చలనం కలిగింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం పోలీస్ శాఖలో బదిలీల పరంపరకు శ్రీకారం చుట్టారు. వివిధ జిల్లాల్లో పని చేస్తున్న 19మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. నిజామాబాద్ కమిషనరేట్‌లో సీసీఎస్‌కు అటాచ్‌గా ఉన్న ఎ.సురేశ్‌ను సీసీఎస్-1 సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎం.రమేశ్‌ను మల్టీజోన్-1 ఐజీ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. సీసీఎస్-2లో పనిచేస్తున్న బి.వీరప్రసాద్‌ను వేములవాడ పీఎస్‌కు బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ సీఐ కె.పురుషోత్తంను ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి సర్కిల్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. నిజామాబాద్ పీసీఆర్‌లో పనిచేస్తున్న రాజశేఖర్ రెడ్డిని మెదక్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఐజీపీలో వెయిటింగ్‌లో ఉన్న పి.రవీందర్‌ను సీసీఎస్-3, ఎల్లయ్యగౌడ్‌ను నిజామాబాద్ వీఆర్‌కు బదిలీ చేశారు.

వారంలోనే భూ సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట, జూన్ 22: పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. నవీపేట మండల కేంద్రంలో శనివారం ధరణి పోర్టల్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిష్కారమైన ధరణి మాడ్యూల్ ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా భూసమస్యలపై 46,746 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 40,271 సమస్యలను పరిష్కరించారన్నారు. మిగతావి త్వరలోనే క్లీయర్ చేయాలని కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లకు ఆదేశాలు జారీచేశారని తెలిపారు. నవీపేట మండలంలో 383 దరఖాస్తులకు 302 పరిష్కరించారని, మిగతా వాటిని వారంలో పరిష్కరిస్తారన్నారు. ఆగస్టు నెలలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకున్నదని అన్నారు. సమావేశంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేందర్‌కుమార్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీలను అందజేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు